
సాక్షి
గుంటూరు
శనివారం । 16 । మార్చి । 2024



సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మకు బంగారం కాసులపేరు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం బంగారపు కాసుల పేరును కానుకగా సమర్పించారు.

యార్డులో 1,32,064 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,15,599 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,32,064 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహరి (ఆది)
గుంటూరు	6.23	4.58
చిలకలూరిపేట	6.26	4.59
బాపట్ల	6.23	4.58

మొబైల్ ఫ్రీ జోన్లుగా
టెన్త్ పరీక్ష కేంద్రాలు

- ఈనెల 18 నుంచి జరిగే పరీక్షలకు సర్వం సిద్ధం
- పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు
- ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం
- జిల్లా వ్యాప్తంగా 147 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 31,291 మంది విద్యార్థులు
- జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ



మాట్లాడుతున్న డీఈఓ శైలజ, వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు బలరాంనాయక్, ఖాసిం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ వెల్లడించారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 460 పాఠశాలల నుంచి 27,366 మంది రెగ్యులర్ విద్యార్థులతో గతంలో తప్పిన, ప్రైవేటుగా రాస్తున్న మరో 3,925 మందిని కలుపుకుని మొత్తం 31,291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. 147 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు హాల్ టికెట్, ప్యాడ్, పెన్ను మినహా మరే ఇతర సామగ్రిని వెంట తీసుకురాకూడదని వివరించారు.

ఉదయం 8.30 నుంచి కేంద్రాల్లోకి అనుమతి..

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులు 8.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 8.45 నుంచి 9.30 వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం..

పరీక్ష కేంద్రాలకు వెళ్లి, వచ్చేందుకు వీలుగా హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి కమిటీ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. పరీక్షల జిల్లా పరిశీలకురాలిగా విద్యాశాఖ డైరెక్టర్ పి.పార్వతిని ప్రభుత్వం నియమించినట్లు వెల్లడించారు.

బార్ కోడింగ్ ఓఎంఆర్‌తో పాటు..

విద్యార్థులకు బార్ కోడింగ్ నంబరు కలిగిన ఓఎంఆర్ షీట్‌తో పాటు ప్రశ్నపత్రంపై ప్రత్యేక సీరియల్ నంబరు ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లి, రోల్ నంబరు ఆధారంగా కేటాయించిన గదిలో వరస క్రమంలో కూర్చున్న విద్యార్థులకు అదే క్రమంలో ఓఎంఆర్ షీట్‌తో పాటు ప్రశ్నపత్రం పంపిణీ చేస్తామని చెప్పారు. ఒకవేళ వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లి సరైన ఓఎంఆర్ షీట్ పొందాలని స్పష్టం చేశారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిందని డీఈఓ శైలజ తెలిపారు. ఎక్కడైనా లీకేజీ ఘటన జరిగితే అది ఏ కేంద్రంలో, ఏ విద్యార్థికి ఇచ్చిన ప్రశ్నపత్రం నుంచి అనే వివరాలను సీరియల్ నంబరు ఆధారంగా గుర్తించే ఆధునిక వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని వివరించారు.

కంట్రోల్ రూమ్ నంబర్లు

99513 97109

89782 13998

సెల్‌ఫోన్లకు అనుమతి లేదు..

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌తో వచ్చేందుకు ఎవరికీ అనుమతి లేదని, విద్యార్థులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు సహా తనిఖీ బృందాల వద్ద సెల్‌ఫోన్ ఉండేందుకు అనుమతి లేదన్నారు. ఫీజు బకాయిలతో పాటు ఇతర ఏ విధమైన కారణాలతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చేందుకు నిరాకరించరాదని, విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలని పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. పరీక్షలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులకు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో గుంటూరు డీవైఈఓ బలరాం నాయక్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.వెంకట్‌రెడ్డి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

మంగళాద్రి తిరునాళ్ల

నేటి నుంచి శ్రీలక్ష్మీనారసింహుని బ్రహ్మోత్సవాలు

- 25న స్వామి దివ్య రథోత్సవం
- నేడు స్వామి వారికి పెండ్లి కుమారుడి ఉత్సవం



శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవారు



విద్యుత్ కాంతులలో గాలిగోపురం

మంగళగిరి: మంగళాద్రిలోని శ్రీలక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ఏడు గంటలకు స్వామిని పెండ్లి కుమారుడి వేడుకతో ఉత్సవం ప్రారంభం కానుంది. బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణంతో ప్రారంభమై ప్రతి రోజు ఒక వాహనంపై భక్తులకు స్వామి వారు దర్శనమివ్వనున్నారు. సోమవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు హనుమంత వాహనం, మంగళవారం రాజ రాజాధి వాహనం, బుధవారం యాలి వాహనం, గురువారం సింహ వాహనం, శుక్రవారం ఉదయం హంస వాహనం, రాత్రి గజవాహనం, శనివారం ఉదయం కల్ప వృక్షవాహనం, రాత్రి పొన్న వాహనం, ఆదివారం ఉదయం అశ్వావాహనాలపై గ్రామోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు పురవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాలలో ముఖ్యంగా పొన్న వాహనం సేవ అత్యత ప్రధానమైనది.

25వ తేదీన రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో ప్రధానఘట్టాలైన స్వామి కల్యాణం 24 వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు స్వామి వారి కల్యాణవేదిక మైదానంలో నిర్వహించనున్నారు. వేలాది భక్త జనసందోహం మధ్య స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. స్వామి వారు ఎదుర్కోల మహోత్సవం జరుపుకుని కల్యాణ వేదికపైకి చేరుకుని భక్తులకు దర్శనమిస్తారు. 25వ తేదీ సోమవారం ఉదయం బంగారు గరుడోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు స్వామి వారి దివ్యరథోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి భక్తులు భారీగా తరలిరానున్నారు.

జీజీహెచ్‌ను పరిశీలించిన న్యాయమూర్తులు

గుంటూరుమెడికల్: జీజీహెచ్‌ను జ్యుడిషియల్ అకాడమీ నుంచి వచ్చిన 69 మంది న్యాయమూర్తులు శుక్రవారం పరిశీలించారు. ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరశర్మ పర్యవేక్షణలో అన్ని విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. శవపరీక్షలు, ఎంఎల్‌సీ కేసుల గురించి తెలుసుకున్నారు. శుశ్రుత హాలులో జరిగిన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అకాడమీ ఏఓ ఎం. శ్రీను, అసిస్టెంట్ డైరెక్టర్ వీ.ఎస్.ఎల్.ప్రసన్న, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ అనిల్, ప్రొటోకాల్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ జి.చంద్రబాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సర ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు శుక్రవారం ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి. సీనియర్ ఇంటర్ పరీక్షలు జరిగిన రోజుల్లో మొత్తం ఐదు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదయ్యాయి. శుక్రవారం జరిగిన సీనియర్ ఇంటర్ కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసిన 28,157 మంది విద్యార్థులకు 27,436 మంది హాజరయ్యారు.


రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్




గుంటూరు మెడికల్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న ఐదువేల మంది ఫార్మశిస్టులకు ఫార్మా ఆఫీసర్లుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన ఫార్మశిస్టులు శుక్రవారం ఆయన చాంబర్‌లో కలిసి డాక్టర్ కిరణ్ కుమార్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మశిస్టు గ్రేడ్ -1ను సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, గ్రేడ్-2ను ఫార్మశీ ఆఫీసర్‌గా, ఫార్మశీ సూపర్‌వైజర్‌ను చీఫ్ ఫార్మశీ ఆఫీసర్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని వెల్లడించారు. గత 50 ఏళ్ళ నుంచి ఫార్మశిస్టులుగా ఉండటం వల్ల ఇబ్బందులు పడ్డారని ప్రభుత్వం తాజాగా హోదా కల్పించడంతో హర్షం వ్యక్తం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు.

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు



లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా మచిలీపట్నం వయా గుంటూరు డివిజన్ మీదుగా సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైలు నంబరు 07041 మచిలీపట్నం–సికింద్రాబాద్ వయా గుంటూరు మీదుగా ఈనెల 18న ప్రత్యేక రైలును కేటాయించినట్లు తెలిపారు. ఈ రైలు మచిలీపట్నం నుంచి 18వ తేదీ రాత్రి 9 గంటలకు బయల్దేరి గుంటూరు మీదుగా సికింద్రాబాద్‌కు మంగళవారం ఉదయం 7.20 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. రైలు మచిలీపట్నం, గుడివాడ, విజయవాడ, కృష్ణా కెనాల్, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. రైలు నంబరు 07043 కాకినాడ టౌన్- సికింద్రాబాద్ రైలు ఈనెల 19న వయా గుంటూరు మీదుగా ప్రత్యేక రైలును కేటాయించినట్లు తెలిపారు. ఈ రైలు కాకినాడ స్టేషన్ నుంచి 19న రాత్రి 9 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకు చేరుకుంటుందన్నారు. రైలు కాకినాడ టౌన్, సామర్లకోట జంక్షన్, రాజమండ్రి, నిడదవోలు జంక్షన్, తణుకు, భీమవరం టౌన్, కైకలూరు, గుడివాడ జంక్షన్, విజయవాడ, కృష్ణకెనాల్, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, పగడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6200, గరిష్ట ధర రూ.7800, మోడల్ ధర రూ.7000 వరకు పలికింది.

నాణ్యమైన విత్తనాలు సరఫరాకు కృషి

రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ జేడీఏ కృపాదాస్



మాట్లాడుతున్న జేడీఏ కృపాదాస్

కొరిటెపాడు(గుంటూరు): వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయం జేడీఏ వీడీవీ కృపాదాస్ ఆదేశించారు. విత్తనాలు, ఎరువుల విషయంలో ఎక్కడ నుంచి ఫిర్యాదు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖరీఫ్–2024 విత్తన సరఫరా ప్రణాళికపై విత్తన ఉత్పత్తిదారులు, సరఫరాదారులు, డీలర్లతో స్థానిక కృషీ భవన్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృపాదాస్ మాట్లాడుతూ విత్తన కంపెనీలు జిల్లాల వారీగా ఇచ్చిన సరఫరా ప్రణాళికకు కట్టుబడి ఉండాలని కోరారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత హెచ్‌టీ(గ్లైసిల్) విత్తనాల అమ్మకం, సాగుకు మన దేశంలో ఆమోదం లేదని, ఈ విత్తనాలు అమ్మిన, సాగు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పత్తి పంట సాధారణ విస్తీర్ణం 36,680 హెక్టార్లు, మిరప 26,869 హెక్టార్లు సాగు చేయవచ్చని అంచనా ఉందని వెల్లడించారు. అందుకు గానూ పత్తి విత్తనాలు 3,29,250 ప్యాకెట్లు, మిరప విత్తనాలు 10,90,915(10 గ్రాములు) ప్యాకెట్లు అవసరం ఉన్నట్లు అంచనా వేసి కంపెనీల వారీగా కేటాయించడం జరిగిందని వివరించారు. జిల్లా ప్రణాళికలో 20 శాతం విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేయాలని సూచించారు. డీలర్లు విధిగా నిబంధనలు పాటించి అమ్మకాలు చేయాలని ఆదేశించారు. షాపుల వద్ద ధరలు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుమలత, గుంటూరు ఏడీఏ ఎం.సునీల్, ఉద్యానశాఖ అధికారి జానకి, వ్యవసాయశాఖ అధికారులు ఓఎస్ఎస్ సునీల్, బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

28న పోలింగ్

పట్నంబజారు: గుంటూరు జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ నెల 28వ తేదీన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నామినేషన్‌ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 15, 16 తేదీల్లో నామినేషన్‌లు స్వీకరించనున్నారు. అధ్యక్ష పదవి, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో పాటు పలు పదవులకు పలు నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం కూడా నామినేషన్‌లు స్వీకరించనున్నారు. ఈ నెల 18వ తేదీన పరిశీలించడంతో పాటు పోటీదారుల లిస్ట్ ప్రకటించనున్నారు. నామినేషన్ దాఖలు చేసిన వారికి సంబంధించి విత్‌డ్రా చే సుకునేందుకు ఈ నెల 19వ తేదీన సాయంత్రం 5గంటలకు వరకు సమయం కేటాయించారు. మొత్తం బార్ అసోసియేషన్‌లో 1941 మందికి ఓటు హక్కు ఉంది. అధ్యక్ష స్థానానికి యంగలశెట్టి శివసూర్యనారాయణ, ఉపాధ్యక్ష స్థానానికి డాక్టర్ చింతా రామకోటిరెడ్డి, ఎం.దేవరాజు(దేవా), లాలి ఏపీ, ప్రధాన కార్యదర్శి స్థానాలకు సుబ్బయ్య లక్కీ, అనూరాధ గురజాల, యరసాని అజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులకు కాలే దేవదాసు, లైబ్రరీ కార్యదర్శి పల్లె నరసింహారావు, బొప్పా శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, రాజేష్‌లింగం. పి.జి.శేషగిరిరావు, మహిళా రిప్రజంటేటివ్ కె.ప్రమీలా, సీనియర్ ఎగ్జిక్యూటివ్(4పోస్టులు)లకు పి.అంకమ్మరావు, కొమ్మినేటి చంద్రశేఖర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (3పోస్టులు)లకు బర్మా రాజశేఖర్, ఆలూరి ప్రశాంతి, తోట నాగసాయిరామ్, ఆర్.శ్రీనివాసరావు, షేక్ మస్తాన్‌వలి, మహిళా ఎగ్జిక్యూటివ్ స్థానానికి పులి ప్రత్యూష నామినేషన్‌లు దాఖలు చేశారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

- రేపు 23 కేంద్రాల్లో పరీక్ష
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఏపీపీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పేపర్ 2 మొత్తం రెండు పేపర్లు అభ్యర్థులు రాయాల్సి ఉంటుందన్నారు. మొత్తం 15,040 మంది అభ్యర్థుల కోసం 23 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ పేపర్ 1 పరీక్షకు ఉదయం 9 నుంచి 9–30 వరకు గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు మొత్తం 9–45 వరకు, మధ్యాహ్నం పేపర్0 2 కు ఒంటి గంట నుంచి 1–30 వరకు గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు 1–45 వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు. అభ్యర్థుల మొబైల్స్‌తో పాటు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతించమన్నారు. పరీక్ష పేపర్ల సీల్డ్ కవర్స్‌ను అభ్యర్థుల సమక్షంలోనే తెరచి అందజేస్తారని చెప్పారు. ఓఎంఆర్ షీట్స్‌పై వైట్నర్ వినియోగిస్తే సంబంధిత అభ్యర్థులను డిస్‌క్వాలిఫై చేస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఏపీపీఎస్సీ సహాయ కార్యదర్శి ఎన్.ప్రమీల పాల్గొన్నారు.

సోషల్ మీడియా జల్లెడ

- గీతాంజలి కేసు దర్యాప్తు వేగవంతం
- ప్రతి హ్యాండిల్ క్షుణ్ణంగా పరిశీలన
- మరోవైపు ప్రత్యేక బృందాల గాలింపు
- నిష్పక్షపాతంగా సాగుతున్న దర్యాప్తు



తెనాలి: గీతాంజలి ఆత్మహత్య కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచిన విషయం తెలిసిందే. నిందితుల గుర్తింపునకు, అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయి. ఒక పక్క సోషల్ మీడియా అకౌంట్లను జల్లెడ పడుతున్నారు. మరోవైపు నిందితుల కోసం గాలిస్తున్నారు. నిష్పక్షపాతంగా, ఎలాంటి రాజకీయ విమర్శలకు తావు లేకుండా అన్ని ఆధారాలతో సహా నిందితులను చట్టం ముందు నిలబెట్టాలనే భావనతో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల ప్రకారం పోలీసు అధికారులు వ్యవహరిస్తున్నారు.

తెనాలికి చెందిన గొల్తి గీతాంజలి స్థానిక ఎమ్మెల్యే చేతులమీదుగా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందుకుని పట్టరాని సంతోషాన్ని యూట్యూబ్ ఛానల్‌తో పంచుకోవటమే ఆమెకు శాపమైంది. ఐటీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోలింగ్‌తో చెలరేగిపోయింది. అసభ్యకరమైన పదజాలాన్ని వాడారు. సభ్యసమాజంలో ఏ ఒక్కరూ అటువంటి ట్రోలింగ్‌ను విన్నా కూడా తట్టుకోలేనంత జుగుప్సాకరంగా ఉన్నాయా పోస్టింగ్‌లు. సాధారణ గృహిణి, ఏ అండా లేని బీసీ మహిళ, ఇద్దరు ఆడపిల్లల తల్లి గీతాంజలిని ఆ ట్రోలింగ్ ఎంతగా మానసిక వ్యథకు గురిచేశాయో? రేపో మాపో ప్రైవేటు స్కూల్లో చేరాల్సిన టీచర్ పోస్టును, ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్‌ను కూడా మర్చిపోయేంత విరక్తిని కల్పించాయి. రైలుపట్టాలపై వస్తున్న రైలుకు ఎదురుగా నడుచుకుంటూ వెళ్లి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీన్ని కూడా సోషల్ మీడియా మూకల ట్రోలింగ్‌ను సమాజంలో ప్రతిఒక్కరూ అసహ్యించుకుంటున్నా, బాధ్యులైనవారు వక్రీకరించటానికి చేయని కుటిలత్వం అంటూ లేదు.

గీతాంజలికి జరిగిన దారుణంపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియో అందించింది. మరణానికి కారకులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రైల్వే పోలీసుల పరిధిలోని కేసును స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. సోషల్‌మీడియా ట్రోలింగ్ వలనే గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులో సెక్షన్లు మార్చి, ఐటీ సెక్షనూ చేర్చారు. గుంటూరు జిల్లా ఎస్పీ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. అంతే దూకుడుగా విజయవాడ, ఉండికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

వెయ్యికి పైగా కామెంట్లు

అసభ్యకర పదజాలాన్ని వాడుతూ ట్రోలింగ్ చేసిన సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. ఈ కేసులో వెయ్యికి పైగా కామెంట్లు ఉన్నాయని అధికారులు ఇప్పటికే వెల్లడించారు. వాటన్నిటినీ నిశితంగా పరిశీలిస్తున్నారు. వీరిలో చాలా మంది సొంత పేర్లతో కాకుండా ఫేక్ అకౌంట్లతో పోస్టులు పెడుతున్నారు. అలాంటి ఫేక్ అకౌంట్ల వెనుకున్న అసలు కూపీదారులను బయటకు లాగే పనిలో అధికారులు తలమునకలై ఉన్నారు. మరోవైపు ఇప్పటికే గుర్తించిన నిందితుల కోసం ఏర్పాటైన ప్రత్యేక బృందం నేతృత్వంలో ఐదు పోలీసు బృందాలు నిందితుల కోసం అన్వేషణ సాగిస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో వీరు డేగ కళ్లతో గాలిస్తున్నారు. విషయం తెలిసి ఇప్పటికే కొందరు సోషల్ మీడియా కార్యకర్తలు పరారీలో ఉన్నట్లు సమాచారం.

కేజీబీవీల్లో ప్రవేశాలకు వేళాయె

- 2024-25 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానం
- 6వ తరగతి, ఫస్ట్ ఇంటర్‌కు అవకాశం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ ప్రారంభం
- జిల్లాలో 6వ తరగతికి 960 సీట్లు, జూనియర్ ఇంటర్‌కు 960 సీట్లు



సత్తెనపల్లిలోని కస్తురిబా గాంధీ బాలికా విద్యాలయం

సత్తెనపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనల్లోంచి పుట్టినదే కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ). నేడు కేజీబీవీలు బాలికా విద్యకు సోపానాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2024–25 విద్యా సంవత్సరంలో కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్ మీడియట్ ప్రథమ ఏడాదిలో ప్రవేశాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. వాటితో పాటు 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లు కూడా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. కేజీబీవీలో చేరేందుకు అనాథలు, బడి బయట చిన్నారులు, బడి మధ్యలో మానేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వలస కార్మికులు, తల్లిదండ్రుల్లో ఒకరే ఉన్న వారు, దారిద్రరేఖకు దిగువన ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది.

హెల్ప్‌లైన్ నంబర్లు

9704100406

8712130405

పల్నాడు జిల్లాలో 24 విద్యాలయాలు...

జిల్లాలో నరసరావుపేట, రొంపిచర్ల, సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, చిలకలూరిపేట, నాదెండ్ల, బొల్లాపల్లి, దాచేపల్లి, దుర్గి, ఈపూరు, మాచవరం, మాచర్ల, వెల్దుర్తి, పిడుగురాళ్ల, గురజాల, కారంపూడి, రెంటచింతల, వినుకొండ, నూజెండ్ల మండలాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఉన్నాయి.

భర్తీ చేయాల్సిన సీట్ల సంఖ్య...

ప్రతి కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, జూనియర్ ఇంటర్‌లో 40 సీట్లు చొప్పున మొత్తం 1920 సీట్ల భర్తీ చేసేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రవేశాలకు అవసరమైన పత్రాలు...

కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో చేరేందుకు బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు బాలికతో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్, ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో పాటు ఫోన్ నెంబర్ ఉంటే ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చు.

క్లుప్తంగా

జెడ్పీలో ఇద్దరికి ఉద్యోగోన్నతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శుక్రవారం ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న తన్నీరు శ్రీనివాసరావును పెదకూరపాడు, బాపట్ల డీపీఆర్‌ఐవో సీనియర్ అసిస్టెంట్ ఎం. లావణ్యను మాచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఏవోలుగా ఉద్యోగోన్నతిపై నియమించారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ నియామకాల్లో భాగంగా యానం నవ్యశ్రీకి సంగం జాగర్లమూడి జెడ్పీ హైస్కూల్లో రాత్రి కాపలాదారుగా నియామకం కల్పించారు. కార్యక్రమంలో కత్తెర సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన క్రీడాకారిణి



శావల్యాపురం: జాతీయ స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్‌లో రన్నర్‌గా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉప్పు బసవరాణి నిలిచిందని పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. పదోవ తరగతి చదువుతున్న బసవరాణి బిహార్‌లోని పాట్నాలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగిన బాల్ బ్యాడ్మింటిన్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు.

ఏపీ మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబరుగా కొండలరావు

నరసరావుపేట: పట్టణంలోని బరంపేటకు చెందిన రామిశెట్టి కొండలరావు ఏపీ మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు పల్నాడు జిల్లా మెంబరుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న జీవో జారీ చేసిందని, రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నట్లు రామిశెట్టి తెలిపారు. కొండలరావు వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. శుక్రవారం విజయవాడలో లేబర్ కమిషనర్ మిరియాల శేషగిరిరావును కలిసి బాధ్యతలు స్వీకరించినట్లు కొండలరావు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా కమిటీలో ఇద్దరిని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా చల్లా మట్టారెడ్డి(మాచర్ల), సంయుక్త కార్యదర్శిగా వేముల దుర్గాప్రసాదు(మాచర్ల) నియమితులయ్యారు.

వైఎస్సార్ హయాం.. రైతులకు స్వర్ణయుగం

డీసీసీబీలో విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి



విగ్రహావిష్కరణలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, లాలుపురం రాము, కృష్ణవేణి తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపించిన వైఎస్సార్ హయాం రైతులకు స్వర్ణయుగమని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. దానికి కొనసాగింపుగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి సంపూర్ణ సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. బ్రాడీపేటలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని డీసీసీబీ చైర్మన్ లాలుపురం రాముతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం బ్యాంకు ఆవరణలో అదనంగా నిర్మించతలపెట్టిన మరో రెండు ఫ్లోర్ల నిర్మాణ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని అప్పిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానేత విగ్రహం డీసీసీబీలో ఏర్పాటు చేయడం సముచితమని అభిప్రాయపడ్డారు. ఇక్కడే మరోపక్క మాజీ సీఎం నందమూరి తారక రామారావు విగ్రహం కూడా ఉండడం ఎంతైనా సమంజసమని తెలిపారు. చైర్మన్ రాము మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్. రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు అంచెలంచెలుగా సహకార బ్యాంకులు, సహకార సంఘాల్ని సీఎం బలోపేతం చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ టి.కృష్ణవేణి, పాలకవర్గ సభ్యులు ఎస్.రామయ్య, కె.హరిబాబు, పి.వెంకటేశ్వర్లు, వి.కోటేశ్వరమ్మ, గోవింద నాయక్, ఏడుకొండలు, శివ నవీన్, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బి.రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, గీతామందిరం చైర్మన్ వి.రత్నప్రసాద్, బ్యాంక్ జీఎంలు మాధవి, ఫణికుమార్, అజయ్ కిశోర్, బాలాజీ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో ఆర్థిక భరోసా

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 41 మందికి రూ.30.56 లక్షల చెక్కులు పంపిణీ



నగదు చెక్కులు అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధితో ఎంతో మంది పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. గత 48 నెలల్లో కొన్ని కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధిని వివక్ష లేకుండా అందించినట్లు మంత్రి అంబటి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు రూ.30.56 లక్షల విలువైన నగదు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం

ఈపూరు: రాష్ట్రం సుభిక్షంగా ఉండి, ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నరసరావుపేట పార్లమెంటు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్‌ను శుక్రవారం కొండ్రముట్లపాలెం, కొండ్రముట్ల, కొచ్చర్ల, అంగలూరు, వనికంట, కొండాయపాలెం, బొగ్గరం, చిట్టాపురం, ముప్పాళ్ల, బొమ్మరాజుపల్లి, ఇనిమెళ్ల, ఈపూరు గ్రామాల్లో ఓటర్లకు పరిచయం చేశారు. ఈ క్రమంలో బోడిశంబునివారి పాలెంలో పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సమన్వయకర్త అనిల్‌కుమార్‌యాదవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించుకొని పార్లమెంటుకు పంపితే మరింత అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ప్రజలకు వివరించారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడును, ఎంపీగా నన్ను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ గెలిపించుకొని రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా చేద్దామని పిలుపునిచ్చారు.

దేవరంపాడు కొండ తిరునాళ్లకు సర్వం సిద్ధం

- మొదటి శనివారం నుంచి ఉగాది వరకు ఉత్సవాల నిర్వహణ
- వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తులు
- దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు



ఆలయంలో స్వయంభూగా మత్స్యరూపంలో వెలసిన స్వామివారు

రాజుపాలెం: జిల్లాలో పల్నాటి తిరుపతిగా వెలుగొందుతున్న దేవరంపాడు కొండ తిరునాళ్ల ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 6 వరకు నాలుగు శనివారాల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉగాది పర్వదినం రోజున ప్రధాన ఉత్సవం నిర్వహిస్తారు. మత్స్యరూపంలో దర్శనమిచ్చే వేంకటేశ్వరుడికి భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడికి తరలిరానున్నారు. ఏటా ఫాల్గుణ మాసం ప్రవేశించిన మొదటి శనివారం రోజున ఈ తిరునాళ్ల ప్రారంభమవుతుంది. ఉగాది పండుగ రోజు ప్రధాన ఉత్సవం నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. దేవరంపాడు కొండపై ప్రధాన ఉత్సవాలు మార్చి 30, ఏప్రిల్ 6వ తేదీల్లో జరుగనున్నవి. ఉగాది పండుగ పర్వదినంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. నేతి వెంకన్న స్వామిగా ప్రసిద్ధి గాంచిన మత్స్య రూపంలో ఉన్న దేవరంపాడు వేంకటేశ్వరుడు విశిష్ట దైవమని భక్తుల నమ్మకం. పాపాలను నశింపజేసి సుఖ సంతోషాలను కలగజేసే స్వామిగా భక్తులు విశ్వసిస్తారు. పశువులు ఈనిన తరువాత కవ్వం పెట్టగానే మూడు పూటలు గానీ, ఐదు పూటలు గానీ మీదు కట్టిన వెన్నను తెచ్చి స్వామివారికి పొంగళ్లు పొంగించి తరువాత స్వామివారి దేవాలయం చుట్టూ పశువులను ప్రదక్షిణ చేయించి నెయ్యి, బియ్యం, పప్పు, బెల్లం, వగైరాలు భక్తులు సమర్పిస్తారు.

నీడలేని కోనేటిరాయుడు

ఈ ఆలయం చరిత్ర ఎంతో ఆసక్తి కరంగా ఉంటుంది. స్వయంభువుగా వెలసిన స్వామికి గర్భగుడిపై గోపురం నిర్మించేందుకు అనేక మంది చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. గోపురం కడుతూ ఉండగా పడిపోతూ ఉండడంతో స్వామివారి ఆలయానికి ఇప్పటికీ గోపుర నిర్మాణం కన్పించదు. గోపురం, కలశంలేని వేంకటేశ్వరుడు బహుశా దేవరంపాడులో మాత్రమే నెలకొన్న విచిత్రం. స్వామి వారి వెనుక భాగంలో ఆలయాన్ని నిర్మించి తిరుపతి దేవస్థానం నుంచి తయారు చేయించి తెచ్చిన శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ తిరునాళ్లకు మూడు, నాల్గవ శనివారాల్లో గుంటూరు, కృష్ణా, నల్గొండ, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు హాజరవుతారని వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని దేవాలయ కమిటీ చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు, దేవాలయ శాఖ కార్యనిర్వాహణాధికారి గుఱ్ఱం శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవాలయంలో శనివారాల్లో ప్రత్యేక పూజలు చేయించుకునే వారు ముందుగా ఈవోకు తెలియజేయాలని కోరారు.

కొండను అభివృద్ధి చేసిన మంత్రి అంబటి

భక్తుల సౌకర్యార్థం దేవరంపాడు దేవాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి అంబటి ఆధ్వర్యంలో చేపట్టారు. ఇప్పటికే ముఖద్వార మండపాన్ని ఏర్పాటు చేశారు. దేవాలయానికి ఇరువైపులా 40 అడుగుల వెడల్పుతో గ్రానైట్ మెట్లను ఏర్పాటు చేశారు. ఈవో కార్యాలయం వరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. కొండ క్రింద నుంచిపై వరకు మధ్యలో డివైడర్‌లు, లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో దేవరంపాడు దేవస్థానం వద్ద రూ.2 కోట్లతో 20 హెక్టార్లలో నగర వనం(ఏకోపార్కు)ను తీర్చిదిద్దారు. తిరునాళ్ల సందర్భంగా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. త్రాగు నీటికి ఇబ్బంది లేకుండా ట్యాంకర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.



ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ అవసరం



నరసరావుపేట రూరల్: దేశానికి క్రమశిక్షణ కలిగిన పౌరులను అందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో సహాయపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ ప్రారంభించాల్సిన అవశ్యకత ఉందన్నారు. నరసరావుపేట లోకల్ అసోసియేషన్ నాయకుడు మామిళ్ళ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచార భద్రతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు



మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: వినియోగదారులు తమ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరుల వద్ద పంచుకోకుండా ఉంటే సైబర్ నేరాలకు అడ్డుకట్టవేయవచ్చని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి జేసీ శ్యాంప్రసాదు వినియోగదారులనుద్దేశించి మాట్లాడారు. వినియోగదారులు నాణ్యత పరిశీలించిన తర్వాతనే వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకొని, వస్తు సేవలను పొందాలని కోరారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలోని మేలుకొలుపు మాస పత్రికలో వినియోగదారులకు అవసరమైన విలువైన సమాచారం ఉంటుందని చెప్పారు. కృత్రిమ మేధస్సుపై మాస్టర్ ట్రైనర్ బీఎం సుభాని, బీవీఏఎల్ వరప్రసాదు మాట్లాడారు. తొలుత ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ అధికారులతో వినియోగదారుల రక్షణలో ఆయా శాఖల పనితీరును జేసీ చర్చించారు. కన్స్యూమర్ వలంటీర్లు పిల్లి నారాయణ, చేగు వెంకటేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ, సంస్థ మేనేజర్ వరలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య, చంద్రకాంత్, ఎల్‌పీజీ బీపీసీఎల్ సేల్స్ డీలర్ రఘురామిరెడ్డి, ఎండీయూ, రేషన్ డీలర్స్ అసోసియేషన్ల అధ్యక్షులు సుధాకరరెడ్డి, పుల్లారావు, వినియోగదారుల సంఘం ప్రతినిధులు ప్రసాదు, కృష్ణకుమారి, లాజరు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పల్నాడు జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 48 పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా అధికారులు సమర్థంగా పరీక్షలు నిర్వహించారు. ఆర్‌ఐ నీలావతిదేవి, పరీక్షల ప్రత్యేక అధికారి టి.శేఖరబాబు తమ సిబ్బంది సహకారం, అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను పకడ్బందీగా జరిపించారు. శుక్రవారం ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 13,686 మంది విద్యార్థులకు గాను 13,118 మంది హాజరయ్యారు. 562 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 13,464 మందికి గాను 12,938మంది, ఒకేషనల్ విద్యార్థులు 222 మందికి గాను 180 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులకు మరో రెండు పరీక్షలు జరగనున్నాయి.


టెన్త్ పరీక్ష కేంద్రాలున్న స్కూళ్లలో మధ్యాహ్నం నుంచి తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ టెన్త్‌తో పాటు దూరవిద్య టెన్త్ పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసిన పాఠశాలల్లో పండుగలు, పర్వదినాలు మినహా ఏప్రిల్ 23 వరకు గల ఇతర సెలవు దినాల్లో తరగతులను నిర్వహించుకోవచ్చునని పేర్కొన్నారు. జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తగు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కిలారి మోహన్‌కుమార్

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన కిలారి మోహన్‌కుమార్‌ను ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఓటింగ్ శాతం పెరిగేందుకు కృషి



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కోరారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు అవగాహన ర్యాలీ, 2కే వాక్ నిర్వహించారు. పల్నాడు రోడ్డు నుంచి చిలకలూరిపేట రోడ్డు వరకు సాగిన ర్యాలీని కలెక్టర్ శివశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో 86 శాతం ఓటింగ్ ఉండేదని, దానిని మరో రెండు శాతం పెంచి 88 శాతంగా చేయవలసిన అవసరం ఉందన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నైతికతతో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ర్యాలీ పల్నాడురోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్యాంపస్ నుంచి చిలకలూరిపేట రోడ్డులోని మెయిన్ క్యాంపస్ వరకు కొనసాగింది. ర్యాలీలో భాగంగా విద్యార్థులు దేశభక్తి పాటలు, నృత్యాలతో ఓటు ప్రాధాన్యతను వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఆర్డీవో సరోజ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి బాలూనాయక్, కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, ఎంఆర్కే సతీష్‌బాబు, డాక్టర్ యోగేశ్వరరావు, కె.వీరరాఘవులు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు పాల్గొన్నారు.